సాక్షి
తిరుపతి
ఆదివారం । 31 । ఆగస్టు । 2025




బాలకార్మికులతో పనులా?

నారాయణ సంస్థలకు చెందిన భవన నిర్మాణ పనుల్లో బాలకార్మికులను పెట్టి పనులు చేయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. - 8లో



బడా నేతలకే బార్లు!

బినామీల ముసుగులో బడా నేతలు బార్లు దక్కించుకున్నారు. దాదాపు 50 శాతం బార్లు వారి చేతుల్లోనే ఉన్నట్లు సమాచారం. - 8లో



సర్వేయర్ భూ ఆక్రమణ

ఓ విలేజ్ సర్వేయర్ ప్రభుత్వ పోరంబోకు స్థలంలో దర్జాగా నిమ్మచెట్లు నాటి ఆక్రమణకు పాల్పడినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. - 8లో

న్యూస్‌రీల్

ఆలయ కమిటీ దరఖాస్తుల పరిశీలన



రామకృష్ణారెడ్డి, దేవాదాయశాఖ అధికారి

తిరుపతి అర్బన్:ఆలయ కమిటీ ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలన చేస్తున్నామని దేవాదాయశాఖ జిల్లా అధికారి పుట్టా రామకృష్ణారెడ్డి వెల్లడించారు. శనివారం ఆయన కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా నెలకొన్న చిన్న ఆలయాలకు సైతం నూతన కమిటీల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను సెప్టెంబర్ మొదటివారం లోపు పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే ఏడాదికి రూ.కోటి ఆదాయం కన్నా తక్కువ రాబడి వచ్చే ఆలయ కమిటీల ఏర్పాటు పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు. తాజాగా రూ.కోటికి పైగా రూ.5 కోట్ల లోపు ఏడాదికి రాబడి వస్తున్న నాలుగు ఆలయాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేయడానికి ఈనెల 27 వరకు దరఖాస్తుల స్వీకరణ పూర్తి చేశామని చెప్పారు. వాటి పరిశీలన త్వరలో పూర్తి చేస్తామని తర్వాత కమిటీల ఏర్పాటు ఉంటుందని పేర్కొన్నారు. ప్రధానంగా జిల్లాలో చిల్లకూరు మండలంలోని తమిళపట్నం కోదండరామేశ్వరాలయం, నాగలాపురం మండలంలోని సూరుటుపల్లికి చెందిన పల్లికొండేశ్వరస్వామి ఆలయం, తిరుపతి అర్బన్‌లోని తాతయ్యగుంట గంగమ్మ ఆలయం, చిల్లకూరు మండలంలోని తూర్పుకనుపూరు ప్రాంతానికి చెందిన ముత్యాలమ్మ ఆలయాల్లో నూతన కమిటీలకు పదుల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని వాటి పరిశీలన జరుగుతోందని వివరించారు.

అక్టోబర్‌లో డీఎల్‌డీఓ కార్యాలయాల ప్రారంభం



డీఎల్‌డీఓ కార్యాలయ పనులను తనిఖీ చేస్తున్న జెడ్పీచైర్‌పర్సన్

గూడూరురూరల్ : డీఎల్‌డీఓ కార్యాలయాలను అక్టోబరులో ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించినట్లు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. గూడూరులోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో ఏర్పాటు కానున్న డీఎల్‌డీఓ కార్యాలయ పనులను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో 5 డివిజన్‌లలో డీఎల్‌డీఓ కార్యాలయాలు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. గూడూరు డీఎల్‌డీఓ కార్యాలయ పనులను తనిఖీ చేసి పనుల నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సెప్టెంబరు 15వ తేదీలోగా పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, డీఎల్‌డీఓ వాణి, గూడూరు ఎంపీడీఓ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీలపై ప్రైవేటు పెత్తనం!

వర్సిటీలపై ఇక ప్రైవేటు పెత్తనం తప్పదు. విద్యా సంస్థలను బహుళజాతి కంపెనీల చేతిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ప్రక్షాళన పేరుతో వర్సిటీలను ప్రైవేటుకు ధారాదత్తం చేసేందుకు కుటిల యత్నం బహిర్గతమవుతోంది. ఇప్పటికే టెండర్లను పిలిచేందుకు వర్సిటీలను సిద్ధం చేశారు. దీనిపై విద్యార్థులు పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సమాయత్తం అవుతున్నారు. విద్యార్థుల జీవితాలు కార్పొరేట్ గుప్పిట్లోకి వెళ్లనుండడంతో విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.



విద్యార్థుల జీవితం కార్పొరేట్ గుప్పిట్లో..

- వర్సిటీల భవితవ్యం అగమ్య గోచరం
- ప్రశ్నపత్రాల మూల్యాంకనం, ఫలితాల వెల్లడిపై టెండర్లు పిలుస్తున్న వర్సిటీలు
- ఎస్వీయూలో కార్పొరేట్ సంస్థలకు ఆహ్వానం పలకనున్న అధికారులు
- వర్సిటీని ప్రైవేటీకరణ చేసే కుట్రకు యత్నం
- అడ్డుకుంటామంటున్న విద్యార్థి సంఘాలు

తిరుపతి సిటీ : యూనివర్సిటీల భవితవ్యం అగమ్య గోచరంగా మారింది. కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్న నేపథ్యంలో వర్సిటీలో ప్రైవేటు సంస్థల ఆధిపత్యాన్ని ప్రోత్సహించేందుకు మరో అడుగు ముందుకేస్తోంది. ఇందులో భాగంగా డిగ్రీ, పీజీ విద్యార్థుల అడ్మిషన్ల వివరాలతో పాటు విద్యార్థులకు నిర్వహించే సెమిస్టర్ పరీక్షలు, ప్రశ్నపత్రాల మూల్యాంకనంతో పాటు, ఫలితాల వెల్లడి ఇక ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు అధికారులు అడుగులు వేస్తున్నారు. ఈ మేరకు ఓ పేరొందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ సూచనల మేరకు ఎస్వీయూ అధికారులు టెండర్లు పిలవనున్నారు. దీంతో ఉన్నత చదువులను అభ్యసించే విద్యార్థుల పరిస్థితి దయనీయంగా మారనుంది. విద్యార్థుల భవితవ్యం పూర్తిగా ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల అ. దీనంలోకి వెళ్లనుంది.

మొక్కుబడిగా టెండర్లు

ఎగ్జామినేషన్ సెక్షన్ ప్రక్షాళన చేస్తున్నామంటూ వర్సిటీ అధికారులు ప్రైవేటు సంస్థలకు టెండర్లు ఆహ్వానించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఓ ప్రైవేటు సంస్థకు అప్పగించాలనే ఉద్దేశంతో ఆ సంస్థ సూచించిన ఆదేశాలతో మొక్కుబడిగా టెండర్లు పిలిచి ఇప్పటికే నిర్ణయం తీసుకున్న బహుళ జాతి కంపెనీ చేతుల్లో పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీంతో విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ నుంచి డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల నిర్వహణ, పేపర్ల మూల్యాంకన, ఫలితాల వెల్లడిని ప్రైవేటు సంస్థల చేతుల్లో పెట్టేందుకు నిర్ణయం తీసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ మేరకు త్వరలో టెండర్లు పిలవనున్నట్లు తెలుస్తోంది.

పేదలకు ఉన్నత విద్య దూరం

వర్సిటీలలో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తుంటారు. కానీ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యను దూరం చేస్తోంది. ఇందులో భాగంగానే ఇప్పటికే ఎస్వీయూ లాంటి ప్రధాన వర్సిటీలో పలు కోర్సులను రద్దు చేస్తూ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇటీవల ఆర్ట్స్ విభాగంలో పదుల సంఖ్యలో కోర్సులను విలీనం పేరుతో రద్దు చేసిన అధికారులు, అకడమిక్ కన్సల్టెంట్లను సైతం తొలగించారు. దీంతో పెద్ద ఎత్తున తాత్కాలిక అధ్యాపకులు, విద్యార్థుల నిరసన వ్యక్తం చేసినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఎస్వీయూలో పేద విద్యార్థులు చదివే కోర్సులకు చరమ గీతం పాడిన వర్సిటీ అధికారులు ప్రస్తుతం వర్సిటీని ప్రైవేటీకరణ చేయడం దారుణమని మేధావులు, విద్యార్థి సంఘాలు మండిపడుతున్నారు.

ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడితే ఊరుకోం



వర్సిటీని ప్రైవేటు పరం చేసే విధంగా అధికారులు నిర్ణయాలు తీసుకుంటే అడ్డుకుంటాం. పరీక్షల విభాగాన్ని టీసీఎస్ కంపెనీ లాంటి ప్రైవేటు సంస్థల సూచనలు పాటిస్తూ టెండర్లకు ఆహ్వానిస్తే అడ్డుకుని తీరుతాం. పేద బడుగు బలహీన వర్గాల ఉన్నత విద్యను సైతం కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఉద్యమిస్తాం. – అశోక్, ఎస్ఎఫ్ఐ వర్సిటీల కోర్డినేటర్, తిరుపతి

పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం



ఎస్వీయూ పరీక్షల విభాగాన్ని ప్రైవేటు పరం చేస్తే పేద విద్యార్థుల భవితవ్యం అంధకారమే. వర్సిటీ ప్రైవేటు పరం అయినట్టే. ఎంతో ప్రతిష్టాత్మకమైన వర్సిటీని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం దారుణం. పరీక్షల నియంత్రణ, మూల్యాంకన, ఫలితాల వెల్లడిని ప్రైవేటు వ్యక్తులు చేతుల్లోకి పెడితే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం. –డాక్టర్ ఓబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు, తిరుపతి

ప్రైవేటుకు అప్పగించేందుకే ..



ఎస్వీయూలో పరీక్షల విభాగం అధికారుల పని తీరు దారుణంగా ఉంది. వర్సిటీని ప్రక్షాళన చేయాలని భావిస్తున్న నేపథ్యంలో ప్రైవేటీకరణపై దృష్టి సారించడం దారుణం. మూల్యాంకనతో పాటు పరీక్షా ఫలితాల వెల్లడి ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు అధికారులు టెండర్లు పిలిచే ప్రయత్నం చేయడాన్ని అడ్డుకుంటాం. – శివశంకర్ నాయక్, జీఎస్ఎన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు, తిరుపతి

విద్యార్థుల ప్రతిఘటన తప్పదు



ఎస్వీయూను ప్రైవేటీకరణ చేస్తే ఐక్య విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ప్రతిఘటిస్తాం. పరీక్షల విభాగాన్ని పటిష్టం చేయాల్సిన అధికారులు చేతులెత్తేయడం దారుణం. పరీక్షల విభాగాన్ని ప్రైవేటీకరణ చేస్తూ ఎస్వీయూ అధికారులు టెండర్లు పిలిచే ప్రక్రియను వ్యతిరేకిస్తున్నాం. పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం.
– ఆర్ ఆషా, పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి, తిరుపతి

చంద్రగిరిలో టీడీపీ గుండాగిరి

- మాజీ సర్పంచ్ దుకాణాన్ని ధ్వంసం చేసిన పచ్చ మూకలు



టీడీపీ గుండాల దాడిలో ధ్వంసమైన టీ దుకాణ సామగ్రి

సాక్షి, టాస్క్‌ఫోర్స్: చంద్రగిరిలో టీడీపీ గుండారి ప్రదర్శిస్తోంది. వైఎస్సార్‌సీపీకి సానుభూతిపరుడు, ఓ మాజీ సర్పంచ్ దుకాణాన్ని టీడీపీ గుండాలు ధ్వంసం చేసిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు వివరాల మేరకు.. చంద్రగిరి నియోజకవర్గం, ఏ.రంగంపేట గ్రామంలో గత కొన్నేళ్లుగా చిన్నరామాపురం మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడు కృష్ణమూర్తి టీ దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. కూటమి పార్టీ ప్రజాప్రతినిధి ఆదేశాల మేరకు టీడీపీ గుండాలు శనివారం రాత్రి ఆ దుకాణం వద్ద కృష్ణమూర్తిపై దాడికి యత్నించారు. అప్రమత్తమైన ఆయన తన భార్య, కుమారుడిని వెంటబెట్టుకుని దుకాణానికి ఉన్న షట్టర్‌ను మూసివేసి లోపలే ప్రాణభయంతో తాళాలు వేసుకున్నాడు. టీడీపీ గుండాలు వెంట తెచ్చుకున్న మారణాయుధాలతో దుకాణం ముందు ఉన్న టీ స్టాల్ స్టాండ్, సిలిండర్, ఇతర సామగ్రిని ధ్వంసం చేసి రోడ్డుపై విసిరేశారు. నిన్ను చంపకుండా ఇక్కడి నుంచి పోము రా..! గత ఎన్నికల్లో మాకు వ్యతిరేకంగా పనిచేశావు.. అంటూ తీవ్ర పదజాలంతో రెచ్చిపోయారు.

ఉప సర్పంచ్‌పై దాడికి వ్యూహం

అదే సమయంలో ఏ.రంగంపేట ఉప సర్పంచ్ మోనీష్‌పై కూడా టీడీపీ గుండాలు దాడిచేయడానికి వ్యూహం పన్నినట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ నాయకుల ఆగడాలపై మోనీష్ అడ్డుతలగడంతో అతనిపై దాడికి యత్నిస్తున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం కూడా కృష్ణమూర్తిపై దాడి చేసి, ఆపై మోనీష్‌తో పాటు అతని ఇంటిపై కూడా దాడికి పాల్పడాలని ప్లాన్ వేసినట్లుగా తెలుస్తోంది.

వైభవంగా వేనాడు గంధోత్సవం



దర్గాలో చద్దర్‌ను సమర్పించిన భక్తులు

తడ : మండలంలోని వేనాడులో వెలసిన షేక్ దావూద్ షావలీ దర్గా గంధోత్సవం శనివారం వేడుకగా నిర్వహించారు. శతాబ్దాల చరిత్ర కలిగిన 144 అడుగుల బాబా దర్గాతో పాటు ఆయన సోదరిగా పిలిచే వహీదాబీ దర్గాను కూడా వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు సందర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. గంధాన్ని పీర్ల చావడి నుంచి రథంలో ఉంచి ఊరేగింపు చేపట్టారు. అనంతరం దర్గాపై నూతన చద్దర్‌ను దర్గాకు అలంకరించారు. ఈ సందర్భంగా సంప్రదాయంగా కడప దర్గాకు చెందిన మతపెద్దలు తెచ్చిన పువ్వులను దర్గాకు అలంకరించారు. గంధం సందర్భంగా నిర్వహించిన ఖవాలీ భక్తులను అలరించాయి.

సభలకు రాకుంటే సంక్షేమ పథకాలు కట్

- డ్వాక్రా సభ్యులపై ఒత్తిడి



జలహారతి సభలో సీఎం చంద్రబాబు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: 'గ్రూపు సభ్యులు తప్పకుండా చంద్రబాబు సభలకు రావాలి. రాకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు కట్ అవుతాయి. పనులు కావాలంటే జరగవు. సార్లు నుంచి మాపై ఒత్తిళ్లు ఉన్నాయి. తప్పకుండా సభలకు రావాల్సిందే..' అంటూ సోషల్ మీడియాలో ఓ ఆడియో చక్కర్లు కొట్టింది. శనివారం కుప్పం నియోజకవర్గంలో సీఎం చంద్రబాబునాయుడు చేపట్టిన జలహారతి కార్యక్రమానికి జన సమీకరణ కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు పడరానిపాట్లు పడ్డారు. రాష్ట్ర నలుమూలల నుంచి ఆర్టీసీ బస్సుల్లో జనసమీకరణ చేపట్టారు. కుప్పం నియోజకవర్గంలో ప్రతి గ్రామానికీ ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసి మరీ జనాన్ని తరలించారు. ఈ బస్సుల్లో ప్రధానంగా వెలుగు గ్రూపు సభ్యులే ఎక్కువగా కనిపించడం గమనార్హం. పుంగనూరు, మదనపల్లి, చిత్తూరు, ఒంగోలు నుంచి జన సమీకరణ చేపట్టారు. ప్రతి బస్సు పైనా అధికార పార్టీ పసుపు జెండా, సీఎం స్పెషల్ స్టిక్కర్లు ఏర్పాటు చేశారు. సీఎం ప్రోగ్రాంకు వచ్చే ప్రతి మహిళకూ ప్రత్యేక కిట్ ఏర్పాటు చేశారు. భోజనం ప్యాకెట్లతో పాటు ప్రత్యేకంగా తినుబండారాలు సమకూర్చారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి జనాన్ని తరలించారు.

విద్యార్థుల తల్లిదండ్రులందరూ రావాలి

డ్వాక్రా గ్రూపు సభ్యులే కాకుండా స్థానికంగా ఉన్న ఓ ప్రవేట్ స్కూల్ యాజమాన్యం సైతం జనసమీకరణ చేపట్టింది. సీఎం ప్రోగ్రామ్‌లకు స్కూల్ బస్సులు పంపుతున్నాం.. విద్యార్థుల తల్లిదండ్రులందరూ తరలి రావాల్సిందే.. అంటూ ఓ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

వంచనతోనే కూటమికి అధికారం



సమావేశంలో పాల్గొన్న, భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ మహిళలు



వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం సమావేశంలో మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

- ఏడాదిన్నర పాలనలో హామీల అమలు గాలికి
- జగనన్న పాలనలోనే ప్రతి ఒక్కరికీ సంక్షేమం
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి



భూమన కరుణాకరరెడ్డి రచించిన పుస్తకాలను పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాళ్లకు అందజేస్తున్న దృశ్యం

తిరుపతి మంగళం : ఎన్నికల సమయంలో నోటికి వచ్చిన అబద్ధాలు గుప్పించి ప్రజలను మోసగించి, వంచించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కళ్యాణి ఆరోపించారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం తిరుపతి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకురాళ్లతో చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కళ్యాణి, రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజితరెడ్డి సమక్షంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుదు కళ్యాణి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఓట్లు దండుకోవడం కోసం చంద్రబాబు నోటికి వచ్చిన అబద్ధాలు గుప్పించి అధికారంలోకి రాగానే వాటిని తుంగల్లో తొక్కేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదన్నర కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చిన పాపానపోలేదని మండిపడ్డారు. కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు జీవితమంతా మోసం, వంచన తప్ప ఏ ఒక్కరికి మంచి చేసిన చరిత్రలేదన్నారు. మోసంతో వంచించిన కూటమి ప్రభుత్వాన్ని గద్దె దింపి సంక్షేమ సారధి జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి అధికారంలోకి తీసుకురావడంతో మహిళలు కీలకంగా వ్యవహరిద్దామని కోరారు.

50 శాతం రిజర్వేషన్ కల్పించి మహిళలకు పదవులు

మేయర్ శిరీష మాట్లాడుతూ.. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి పురుషులకు సమానంగా హక్కులు, ఉన్నత పదవులను కల్పించిన గొప్ప నాయకులన్నారు. మహిళలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి కృషి చేసి ఉన్నత పదవులు కల్పించి సమాజంలో ఒక ప్రత్యేక గుర్తింపునిచ్చారని సగర్వంగా చెప్పారు.

కక్షపూరిత రాజకీయాలతో అక్రమ కేసులు

పార్టీ మహిళా విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాని పూజితరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్షపూరిత రాజకీయాలతో అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపుతున్నారే తప్ప ప్రజాసంక్షేమాన్ని, అభివృద్ధిని పట్టించుకోవడంలేదన్నారు. కూటమి అరాచకాలను ఎప్పటికప్పుడు ఎండగడుతూ జగనన్నను తిరిగి అధికారంలోకి తెచ్చుకోవడానికి మహిళలంతా ఒక్కటై వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నిరంతరం శ్రమిద్దామని పిలుపునిచ్చారు.

జగనన్న పాలనలోనే మహిళలకు ఉన్నత స్థానం

భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారం కోసం ప్రజలను వంచించే తత్వం చంద్రబాబుదైతే, అధికారం లేకపోయినా పర్వాలేదు, ప్రజలకు అబద్ధాలు చెప్పి మోసగించలేనన్న గొప్ప మనస్తత్వం కలిగిన నాయకుడు జగనన్న అన్నారు. కూటమి పాలనలో మహిళా సాధికారత అనేదే లేదన్నారు. తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు అంటూ మహిళలను మోసగించిన ద్రోహి చంద్రబాబు అన్నారు. జగనన్న పాలనలోనే మహిళలకు ఉన్నత స్థానం లభించిందన్నారు. కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజల పక్షాన నిలబడి పోరాడుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గీతాయాదవ్, జోనల్ ప్రెసిడెంట్ మెయిళ్ల గౌరీ, జిల్లా అధ్యక్షురాలు మాధవిరెడ్డి, నగర అధ్యక్షురాలు కోటేశ్వరమ్మ, కార్పొరేటర్లు ఆరణి సంధ్య, ఉమా అజయ్, బసవగీత, తిరుపతి నగర బూత్ కమిటీ ఇన్‌చార్జ్ ముప్పాల సాయికుమారి, పార్టీ మహిళలు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుదాం

- బూత్, గ్రామస్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలి
- పుంగనూరు నియోజకవర్గ నాయకుల సమావేశంలో పెద్దిరెడ్డి



పుంగనూరు నియోజకవర్గ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

తిరుపతి మంగళం : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుదామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్, పుంగనూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి మారుతీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో పార్టీ సంస్థాగత ఎన్నికల కమిటీ రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డితో కలిసి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నియోజకవర్గ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలను స్క్రీన్ ద్వారా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వజ్ర భాస్కర్‌రెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డప్ప, టీటీడీ మాజీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్‌తో పాటు పార్టీ శ్రేణులు తిలకించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్ కక్షపూరిత రాజకీయాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఏడాదిలోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న సీఎంగా చంద్రబాబు మిగిలిపోయారన్నారు. రాష్ట్రంలో, పుంగనూరు నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ప్రతి ఒక్కరూ శ్రమిద్దామని పిలుపునిచ్చారు. వచ్చే నెల 5వతేదీకి పుంగనూరు నియోజకవర్గంలో అన్ని కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు.



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనలను స్క్రీన్ ద్వారా తిలకిస్తున్న, పెద్దిరెడ్డి, వజ్ర భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, నేతలు

క్లుప్తంగా

మహిళ అనుమానాస్పద మృతి

రాపూరు : పంచాయతీ పరిధిలోని నవాబుపేటలో శనివారం వివాహిత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అంకుపల్లి మౌనిక(54) శనివారం ఉదయం నవాబుపేట ఎస్సీ కాలనీలోని తన ఇంట్లో పడిపోయి ఉండడం గమనించిన ఇరుగుపొరుగువారు రాపూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందిందని, మౌనిక మెడ వద్ద వత్తుకుని ఉండడంతో వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మౌనిక కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు మౌనిక మృతిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

పరశురామేశ్వరుని సేవలో జిల్లా కలెక్టర్


పరశురామేశ్వరుని సేవలో కలెక్టర్ వెంకటేశ్వర్

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లంలో వెలసిన ప్రఖ్యాత శైవ క్షేత్రం పరశురామేశ్వరాలయాన్ని కలెక్టర్ వెంకటేశ్వర్ శనివారం సందర్శించారు. వారికి ఆలయ మర్యాదలతో ఆలయ మాజీ చైర్మన్ బత్తల గిరినాయుడు, కార్య నిర్వహణ అధికారి రామచంద్రా రెడ్డి స్వాగతం పలికి స్వామి, అమ్మవారి దర్శనం చేయించారు. వేద పండితులచే ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

టీటీడీ ఉద్యోగి అనుమానాస్పద మృతి


కోనేటి సుబ్బరాజు(ఫైల్)

తిరుపతి కల్చరల్: సుబ్బరాజు నాట్య కళాపరిషత్ నిర్వాహకుడు, టీటీడీ ఉద్యోగి కోనేటి సుబ్బరాజు (62) శుక్రవారం అర్ధరాత్రి తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం కపిలేశ్వరాలయంలో ఏఈవోగా పని చేస్తున్న ఈయన ఈనెల 31న పదవీ విరమణ పొందనున్నారు. అనారోగ్యంతో శుక్రవారం రాత్రి ఆయన మృతి చెందడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. మృతుడి భార్య కోనేటి వెంకట సరస్వతి ఫిర్యాదు మేరకు అలిపిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు శనివారం రుయా ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. శనివారం సాయంత్రం గోవింద ధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

పింఛన్..టెన్షన్

- 7 వేల మందికి పింఛన్ తొలగింపు నోటీసులు
- అప్పీల్‌కు అవకాశం ఇచ్చిన అధికారులు
- అప్పీల్ చేసిన , చేయని వారికి పింఛన్ అందేనా?
- రేపటి నుంచి పింఛన్ల పంపిణీ


పింఛన్లు తొలగించడంతో కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు (ఫైల్)

తిరుపతి అర్బన్ : పింఛన్‌దారులకు సెప్టెంబర్ 1 టెన్షన్ పట్టుకుంది. ఆగస్టుకు చెందిన పింఛన్లు సెప్టెంబర్ 1న ఇవ్వాలని ఇప్పటికే కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. అయితే ఇటీవల వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులకు సంబంధించి జిల్లాలో 7 వేల మందికి పింఛన్లు తొలగిస్తున్నట్లు సచివాలయ ఉద్యోగుల నుంచి నోటీసులు అందుకున్నారు. దివ్యాంగుల ఆందోళనతో దిగివచ్చిన కూటమి ప్రభుత్వం ఆగస్టు 31లోపు తొలగించిన పింఛన్‌దారులు రూరల్ ప్రాంతానికి చెందిన వారు ఎంపీడీఓ కార్యాలయం, అర్బన్ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ వద్ద అప్పీలు చేసుకోవాలని తెలిపారు. ఆ మేరకు వైద్యులు మరోసారి పరీక్షలు చేపట్టనున్నారు.

నోటీసులు అందుకున్న పింఛన్ లబ్ధిదారులు అప్పీలు చేసుకొనే అంశంపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు పెద్ద ఎత్తున అవగాహన కల్పించలేకపోవడంతో చాలా మంది దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు అప్పీలు చేసుకోలేకపోయారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియకపోవడంతో ఇప్పటికీ పలువురు కలెక్టరేట్ ఆఫీస్ వద్ద పడిగాపులు కాస్తున్నారు. దీంతో వారంతా తమకు సెప్టెంబర్ 1న పింఛన్లు ఇస్తారా లేదా ? ఇవ్వరా? అనే ఆందోళన చెందుతున్నారు. అందరికీ ఇచ్చేవారైతే మళ్లీ అప్పీలు చేసుకోమని ఎందుకు చెప్పారంటూ పలువురు చర్చించుకుంటున్నారు. మొత్తంగా సెప్టెంబర్ 1 కోసం దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు ఎదురుచూస్తున్నారు. సెప్టెంబర్ 1న యథావిధిగా రూ.15 వేలు ఇస్తారా లేదా రూ.6 వేలు ఇస్తారా లేదా పూర్తిగా తొలగిస్తారా అనే భిన్నాభిప్రాయాలతో పింఛన్ లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

సామాజిక భద్రతా పింఛన్ల తొలగింపు

కూటమి ప్రభుత్వం సామాజిక భద్రతా పింఛన్‌లో భాగంగా ప్రధానంగా వృద్ధులకు అందిస్తున్న పింఛన్లు ప్రతి నెలా తగ్గిస్తున్న సంగతి తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 14 నెలల కాలంలోనే 12,211 పింఛన్లు తొలగించారు. తాజాగా ఆగస్టులో 2,63,743 మందికి పంపిణీ చేశారు. అయితే సెప్టెంబర్‌లో 2,63,350 మందికి మాత్రమే పింఛన్లు ఇవ్వనున్నారు.

పింఛన్ తిరిగి ఇప్పించండి



నా పింఛన్ తొలగించారు.. తిరిగీ ఇప్పించండి అంటూ కలెక్టరేట్ కార్యాలయం వద్ద అందర్నీ ప్రాధేయపడుతూ కన్నీరు పెట్టుకుంటున్న ఓ వృద్ధురాలు ఆవేదన పలువురిని కలచివేసింది. ఈమె పేరు బి. దిల్షాద్, ఈదులగుంట, తొట్టంబేడు మండలం. దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలు తీసుకుంటోంది. అయితే ఇటీవల కూటమి ప్రభుత్వం పింఛన్ తొలగించడంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక కలెక్టరేట్‌కు వచ్చారు. దీంతో అక్కడి వారు తొట్టంబేడు ఎంపీడీవో ఆఫీస్‌కు వెళ్లాలని సూచించారు. – బి.దిల్షాద్, దివ్యాంగురాలు, ఈదులగుంట, తొట్టంబేడు మండలం

ఒక్క పింఛన్ తొలగించినా పోరాడుతాం



దివ్యాంగుల పింఛన్లు ఆగస్టులో ఎంత మందికి ఇచ్చారో..అంత మందికీ సెప్టెంబర్‌లో ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం. ఒక్క పింఛన్ తగ్గినా పోరాడుతాం. అందరికీ పూర్తి అవగాహన లేకపోవడంతో ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ కార్యాలయాల్లో అప్పీలు చేసుకోలేదు. అప్పీలు చేసుకోలేకపోయిన వారికీ పింఛన్లు ఇవ్వాలి. రీవెరిఫికేషన్‌లో వైద్యులు వికలత్వం తగ్గించడంతోనే సమస్యలు వచ్చాయి. అందరికీ న్యాయం చేయాలి. – చంద్రశేఖర్, దివ్యాంగుల జేఏసీ స్టేట్ ప్రెసిడెంట్

బాలకార్మికులతో పనులా?

- తుడా లే అవుట్‌లో రోడ్డును బ్లాక్ చేసి సొంత స్థలంలా పనులు


తుడా లే అవుట్‌లోని రోడ్ల పై కంటైనర్లు, సామగ్రి వేసి ఆక్రమించుకున్న వైనం


సాక్షి టాస్క్ ఫోర్స్ : రేణిగుంట మండలంలోని విప్పమాని పట్టెడ పంచాయతీలోని తుడా లేఅవుట్‌లో నారాయణ విద్యాసంస్థలకు చెందిన నూతన భవన నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు కొంత మంది బాల కార్మికులను పెట్టి పనులు చేయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పశ్చిమబెంగాల్‌కు చెందిన భవన నిర్మాణ కార్మికుడు శుక్రవారం సాయంత్రం అక్కడ పనిచేస్తూ మృతి చెందాడు. ఈ ఘటన కవరేజీకి సంబంధించి తుడా లేఅవుట్‌లోకి వెళ్లిన విలేకరులకు ప్రవేశం లేదని నారాయణ విద్యాసంస్థల ప్రతినిధులు అనుచిత వ్యాఖ్యలు చేశారు. కూలి డబ్బులు తక్కువ ఇవ్వొచ్చనే దురాలోచనతో కాంట్రాక్టర్లు బాల కార్మికులను పెట్టి పనులు చేయిస్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అధికారులు ఇలాంటి భవన నిర్మాణ ప్రదేశాలను తనిఖీలు నిర్వహించి బాల కార్మికులను నిర్మూలించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. మంత్రికి సంబంధించిన విద్యా సంస్థ కావడంతో భవన నిర్మాణ పనులకు అనుమతుల పరిశీలన, తదితర వివరాలపై అధికారులు దాటవేత దోరణి అవలంబిస్తున్నారు. తుడా లే అవుట్‌లోని రోడ్డును తమ సొంత స్థలం లాగా వినియోగించుకుంటున్నట్లు తెలుస్తోంది. కంటైనర్లను శాశ్వతంగా ఏర్పాటు చేసి రోడ్లను బ్లాక్ చేసి అడిగిన వారిని బెదిరిస్తున్నారని సమాచారం.

భరద్వాజ తీర్థంలో క్షుద్రపూజల కలకలం


ఆలయ సమీపంలో క్షుద్ర పూజల దృశ్యం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి ఆలయ అనుబంధ భరద్వాజ తీర్థంలో గత శనివారం అమావాస్య సందర్భంగా క్షుద్ర పూజలు చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. వారం రోజులు గడుస్తున్నా అక్కడ ముగ్గులు, రాతి ప్రతిమలు, పసుపు, కుంకుమ దీపాలు కనిపిస్తున్నా ఆలయ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమావాస్య పోయి వారం రోజులు గడుస్తున్నా ఆ ప్రతిమలను ఆలయ అధికారులు తీయలేదు. వర్షం పడటంతో కొంతమేర పూజా ఆనవాలు కనబడటంలేదు.భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

యువకుడిపై హత్యాయత్నం


ఘటనా స్థలంలో కారంపొడి చల్లి ఉన్న దృశ్యం

కలువాయి (సైదాపురం) : యువకుడిపై హత్యాయత్నం చేసిన ఘటన మండల కేంద్రమైన కలువాయి నాయీ బ్రాహ్మణ కాలనీలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే కలువాయి నాయీ బ్రాహ్మణ కాలనీలోని వినాయకుడి మండపం వద్ద పూజ జరుగుతున్న సమయంలో అదే కాలనీలో ఉంటున్న ప్రదీప్ బైక్‌పై మితిమీరిన వేగంతో అటుగా రావడంతో అక్కడే ఉన్న మహర్షి అనే వ్యక్తి ..నెమ్మదిగా వెళ్లమని చెప్పగా అతడితో గొడవకు దిగి ఉదయంలోపు చంపేస్తామని బెదిరించి ప్రదీప్ అక్కడ నుంచి వెళ్లిపోయాడు. శనివారం తెల్లవారు జామున ప్రదీప్ మరో ఇద్దరిని వెంట తీసుకొచ్చి ఆ వ్యక్తే (మహర్షి)అనుకొని అక్కడ నిద్రిస్తున్న వేరే వ్యక్తిపై కారంపొడి చల్లి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అది గమనించిన చుట్టూ పక్కల వారు అడ్డుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడికి వచ్చిన పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకోగా హత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి మాత్రం పోలీసులతో గొడవకు దిగి పారిపోయాడు. ఈ విషయానికి సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కోటయ్య తెలిపారు.

రాష్ట్ర స్థాయి విజేత తిరుపతి హాకీ జట్టు


మంత్రి చేతుల మీదుగా చాంపియన్ షిప్ అందుకుంటున్న తిరుపతి జిల్లా జట్టుతో హాకీ కోచ్ దీపక్

చిల్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమరావతి పేరుతో క్రీడా పోటీలను ఆరంభించి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించింది. ఈ క్రమంలో శుక్రవారం రాష్ట్ర స్థాయిలో జరిగిన ఫైనల్ హాకీ పోటీలలో తిరుపతి జట్టు విజయం సాధించింది. మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా రాష్ట్ర చాంపియన్ షిప్ కప్పును అందుకున్నట్లు హాకీ కోచ్ ఆకాష్‌దీపక్ శనివారం తెలిపారు. హాకీ కోచ్ దీపక్ మాట్లాడుతూ అమరావతి పేరుతో నిర్వహించిన క్రీడా పోటీలలో వైజాగ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అనకాపల్లి జట్టు, తిరుపతి జట్లు తలపడ్డాయని, ఈ పోటీలో అనకాపల్లి జట్టుపై తిరుపతి హాకీ జట్టు 3–0 తేడాతో విజయం సాధించి చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకున్నట్టు వెల్లడించారు.

సర్వేయర్ భూ ఆక్రమణ

సైదాపురం(కలువాయి) : మండలంలోని కొటూరుపల్లి నందు సర్వే నంబర్ 26, రీసర్వే తర్వాత ఎల్‌పీఎం నంబర్ 31 నందు 5 ఎకరాల ప్రభుత్వ పోరంబోకు భూమిలో విలేజ్ సర్వేయర్ దర్జాగా నిమ్మచెట్లు నాటి ఆక్రమించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విలేజ్ సర్వేయర్ సొంతూరు ఉయ్యాలపల్లి పంచాయతీ కావడంతో రీ సర్వే సమయంలో ఉయ్యాలపల్లి, కోటూరుపల్లి పంచాయతీలో రీ సర్వేలో విలేజ్ సర్వేయర్ వెంకటరమణ తను చేతివాటాన్ని ప్రదర్శించాడు. రీ సర్వే సమయంలో భూమిని ఆక్రమించినట్లు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా మండల రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిన్నటి దాకా కుల్లూరు పంచాయతీ విలేజ్ సర్వేయర్‌గా పనిచేసిన అతను ఇటీవలే అంతసాగరం మండలానికి బదిలీ కాగా మళ్లీ పచ్చనేతల సహకారంతో డిప్యూటేషన్‌పై మండలానికి వచ్చినట్లు తెలిసింది. ప్రస్తుతం బ్రాహ్మణపల్లి రీసర్వేలో కూడా భారీగా అవినీతికి పాల్పడినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ భూమి ఆక్రమణ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గిరిజనుల కోసం ప్రత్యేక ఆధార్ శిబిరాలు

తిరుపతి అర్బన్:జిల్లాలోని గిరిజనులకు ఆధార్ కార్డులు లేకపోవడంతో ప్రత్యేక ఆధార్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ , సాధికారత అధికారి రాజా సోము తెలిపారు. గిరిజనులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సెప్టెంబర్ 1 నుంచి వచ్చే ఏడాది (2026) జనవరి 17 వరకు ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఉంటాయని పేర్కొన్నారు. ముందుగా వారికి జనన ధ్రువీకరణ పత్రాలు, నివాస ధ్రువీకరణ పత్రాలను జారీ చేస్తారని చెప్పారు. వాటి ఆధారంగా అందరికీ ఆధార్ కార్డుల అవకాశాన్ని కల్పిస్తారని ఆయన వివరించారు. జిల్లాలో 40 ప్రత్యేక ఆధార్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రధానంగా అన్ని మండల కేంద్రాల్లో ఉంటాయని చెప్పారు.

బడా నేతలకే బార్లు!

- 26 బార్లకు అనుమతి
- లాటరీ పద్ధతిలో కేటాయింపు


హాజరైన మద్యం వ్యాపారులు, ఎక్సైజ్ అధికారులు

తిరుపతి అర్బన్ , తిరుపతి క్రైమ్ : లాటరీ పద్ధతిలో మద్యం బార్ల కేటాయింపు ప్రక్రియను కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎక్సైజ్ జిల్లా అధికారి నాగమల్లేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గతంలో 19 బార్లు ఉంటే కూటమి సర్కార్ మాత్రం 32 బార్లకు జిల్లాలో అవకాశం కల్పించింది. అందులో 26 బార్లను లాటరీ పద్ధతిలో శనివారం ఎంపిక చేశారు. మరో 6 బార్లకు త్వరలో కొత్త నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. శనివారం ఎంపిక చేసిన 26 బార్లకు సంబంధించి ఓపెన్ కేటగిరిలో 23 బార్లకు 173 దరఖాస్తులు, గీత కులాల వారికి కేటాయించిన 3 బార్లకు 36 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 210 దరఖాస్తులకు టోకెన్ నంబర్లు ఇచ్చి లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఆ మేరకు కలెక్టరేట్‌లో ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు లాటరీ పద్ధతిలో బార్ల కేటాయింపు చేపట్టారు. తిరుపతి యూనిట్ పరిధిలో 18, శ్రీకాళహస్తిలో 03, గూడూరులో 02, చంద్రగిరిలో 01, పుత్తూరులో 01, నాయుడుపేటలో 01 బారును నిర్వహించడానికి లైసెన్స్‌లు జారీ చేశారు.

10 చోట్ల మహిళలకు అవకాశం

10 చోట్ల మహిళలకు అవకాశం దక్కింది. అందులో తిరుపతిలో 7 బార్లు, పుత్తూరులో 1, శ్రీకాళహస్తిలో 1, గూడూరులో 1 మహిళల సొంత అయ్యాయి. మిగిలిన 16 బార్లు పురుషులు దక్కించుకున్నారు.

బినామీల చేతుల్లోనే...

జిల్లాలో 26 బార్లకు లైసెన్స్‌లు జారీ చేసినప్పటికీ అందులో 50శాతం బార్లు బినామీల చేతుల్లోనే ఉండిపోయాయి. బార్‌ను దక్కించుకోవడానికి దరఖాస్తుకు రూ.5 లక్షలు, లైసెన్స్ పొందడానికి రూ.50 లక్షలు చెల్లించాల్సి ఉంది. దీంతో అంతా మొత్తాన్ని పెట్టుబడి పెట్టడానికి సామాన్యులకు వీలుకాదు. దీంతో బడా నేతలు పెట్టుబడి పెట్టి తమ అనుచరుల పేర్లుతో బార్లు దక్కించుకున్నారని జోరుగా చర్చసాగుతోంది. లక్కీ డ్రా ద్వారా జిల్లాలో 26 బార్లను ఎంపిక చేశారు. ఈ క్రమంలో వాటి ద్వారా రూ.12,95,58,415 ప్రభుత్వ ఖజానాలో చేరనుంది. బార్ దక్కించుకున్న వారికి 3 ఏళ్ల గడువు ఉంటుంది.

భ్రమపడకండి!

- ఏడాది కాకుండానే అపోహలతో అసత్య ప్రచారాలు
- నియోజకవర్గం పునర్విభజన జరిగితే నేను కూడా ఎమ్మెల్యే రేసులో ఉన్నా
- స్త్రీశక్తి సభలో చర్చనీయాంశమైన ఎమ్మెల్యే నాని సతీమణి వ్యాఖ్యలు

సాక్షి, టాస్క్‌ఫోర్స్: చంద్రగిరి నియోజవర్గ పునర్విభజనలో తనకే టిక్కెట్టు వస్తుందని కొంతమంది జోరుగా ప్రచారం చేయడంపై కూటమి ఎమ్మెల్యే నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో తీవ్ర దుమారం రేపాయి. గత ఎన్నికల్లో టీడీపీలోని ఓ నేత క్రియాశీలకంగా ఎమ్మెల్యే నాని గెలుపుకోసం పనిచేశారు. ఆయన శ్రమను గుర్తించి, సీఎం చంద్రబాబు నామినేటెడ్ పదవిని సైతం ఆయనకు కట్టబెట్టారు. ఈ క్రమంలో రానున్న రోజుల్లో నియోజకవర్గ పునర్విభజన జరిగితే ఆ నేతకు టీడీపీ టికెట్టు తప్పనిసరి అని గత కొన్ని రోజులుగా నియోజకవర్గంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. చంద్రగిరికి చెందిన పలువురు టీడీపీ నేతలు సైతం పెద్ద ఎత్తున ఆ నేతకు టచ్‌లోకి వెళ్లారు. ఈ నేపథ్యంలో శనివారం చంద్రగిరి మార్కెట్ యార్డులో స్త్రీశక్తి విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నానితో పాటు కూటమిలోని జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పులివర్తి సుధారెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా చంద్రగిరి విడిపోతుందని ప్రచారం చేస్తున్నారని, ఒకరు అటుపోతారు, ఇంకొకరు ఇటు పోతారని మాట్లాడుకుంటున్నారని పరోక్షంగా ఆ నేత అంశాన్ని ప్రస్తావించారు. అసలు నియోజకవర్గాల పునర్విభజన జరిగితే తానుకూడా ఎమ్మెల్యే రేసులో ఉంటానన్నారు. కన్ఫ్యూజ్ అయ్యి, పది మందిని కన్ఫ్యూజ్ చేసి గుంపులుగా తయారవ్వద్దని సూచించారు. 2029 వరకూ నానినే ఎమ్మెల్యే అన్నారు. ఇదిలావుండగా ఈ కార్యక్రమానికి చంద్రగిరికి చెందిన కీలక నేతలు హాజరుకాకపోవడం గమనార్హం.